క్లుప్తంగా

33వ వార్డులో వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం



వాసుపల్లిని సత్కరిస్తున్న బోర విజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి తదితరులు

అల్లిపురం : నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం చైర్‌పర్సన్ బోర విజయలక్ష్మి ఆధ్వర్యంలో లీలామహల్ రోడ్డులో గల అశోకా రెసిడెన్సీలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం అయింది. శుక్రవారం ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ దీనిని ప్రారంభించారు. అనంతరం ఆయన దివంగత నేత వై.ఎస్. రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వాసుపల్లిని పార్టీ శ్రేణులు గజమాలతో సత్కరించారు. 33వ వార్డులో వెంకటేశ్వరమెట్ట ప్రజల సమస్యకు శాశ్వత పరిష్కారం అందించామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు.

నేడు 'సామాజికం' సీఎస్సార్-2024 సదస్సు



మాట్లాడుతున్న మధుసూదనరావు

దాబాగార్డెన్స్ : రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ 'సామాజికం'సీఎస్సార్-2024 సదస్సు విశాఖలో ఈ నెల 27న నిర్వహించనున్నట్టు రోటరీ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు సీఏ డి. మధుసూదనరావు తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోటరీ ఇంటర్నేషనల్ విశాఖపట్నం ఆధ్వర్యంలో రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు నేతృత్వంలో ఈ సదస్సు జరుగుతుందన్నారు. హోటల్ నోవాటెల్ వేదికగా శనివారం సాయంత్రం నిర్వహించనున్న సీఎస్సార్ సదస్సులో ముఖ్యంగా సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా నిరుపేద మహిళలు, చిన్నారులు, అనాథలకు సహాయ సహకారాలు అందివ్వడమే లక్ష్యంగా సదస్సు ఉంటుందన్నారు. ముంబై డిప్యూటీ రిజిస్టర్ ఆఫ్ కంపెనీస్ సాయిశంకర లండా, పీడీజీ శ్యామ్ మొవ్వ, సంజాయి పవర్‌మర్, ఆర్. వెంకటరమణ, పలువురు ప్రముఖులు పాల్గొని చర్చించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి రఘుపతి, ఆర్. మెషినల్లి, సుబ్బారావు రావూరి తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు ఆత్మీయ సత్కారం



సత్కారం పొందిన కళాకారులతో అతిథులు

సీతమ్మధార : రంగసాయి నాటక గ్రంథాలయం 12వ వార్షికోత్సవం సందర్భంగా పలువురు కళాకారులకు ఆత్మీయ సత్కారాలు జరిగాయి. టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో గల గ్రంథాలయంలో శుక్రవారం సాయంత్రం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగస్థల నటీమణి, కందుకూరి, గరుడ అవార్డు గ్రహీత, దర్శకురాలు హుస్సేన్ జహాన్ బేగం, పౌరాణిక కళాకారిణి, సంగీత దర్శకురాలు, నంది అవార్డు గ్రహీత బగాది విజయ సారథి, రచయిత, నటుడు, దర్శకుడు, కందుకూరి బంగారు నంది అవార్డు గ్రహీత, జర్నలిస్టు డేవిడ్ రాజ్, రచయిత, నటుడు, చిత్ర దర్శకుడు, నంది అవార్డు గ్రహీత డాక్టర్ కంద్రాతి సాంబశివరావు తదితరులను ఆత్మీయ సత్కారాలతో గౌరవించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయితో పాటు పలువురు కళాకారులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలు వైఎస్సార్‌సీపీతోనే

- దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్
- 27వ వార్డులో విస్తృత ప్రచారం
- అఖండ స్వాగతం పలికిన ప్రజలు



దొండపర్తి ప్రచారంలో చిన్నారిని ఎత్తుకున్న వాసుపల్లి గణేష్‌కుమార్



27వ వార్డులో వాసుపల్లికి హారతులిస్తున్న స్థానిక మహిళలు



దొండపర్తిలో గజమాలతో వాసుపల్లికి స్వాగతం పలుకుతున్న సర్వేశ్వరరెడ్డి తదితరులు

సీతమ్మధార : అన్ని వర్గాలు వైఎస్సార్‌సీపీతోనే ఉన్నాయని, అనైతికంగా పొత్తు పెట్టుకున్న టీడీపీ, జనసేన, బీజేపీలను చిత్తుగా ఓడించి దక్షిణలో అత్యధిక మెజారిటీ సాధిస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 27వ వార్డులోని దొండపర్తిలో పెద్ద ఎత్తున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి తరలి వచ్చిన ఆయనకు వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి తదితరులు సాదర స్వాగతం పలికారు. ఆయన ముందుగా దొండపర్తి ఇలవేల్పు ఎరుకుమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన వార్డులోని గడప గడపకు వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని అభ్యర్థించారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే బీజేపీతో ఎప్పుడైతే టీడీపీ, జనసేన జత కట్టాయో అప్పుడే వాటి నైజం అర్థమయిందన్నారు. 46 డిగ్రీల ఎండ వేడిని కూడా లెక్క చేయకుండా ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్న అభిమానులు, ప్రజలను చూస్తుంటే మరింత ఉత్సాహం వస్తుందన్నారు. తమ విజయం తథ్యమన్నారు. వాసుపల్లితో పాటు ఆయన కుమారుడు సూర్య, కోడలు రాశి కూడా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు వాసుపల్లికి హారతులు ఇచ్చి అఖండ స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మాజీ కార్పొరేటర్ జి.వి.రవిరాజ్, పద్మనాభం అమ్మాజీ, ఎల్లపు రఘురాం, చిట్టిబోయిన శివ, అజయ్, అశోక్, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల మద్దతు కోరిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు..

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డు మసీదులో ముస్లిం యువత, పెద్దలను వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ కలిసి మద్దతు కోరారు. వార్డులోని రామకృష్ణా థియేటర్ సమీపంలో శుక్రవారం ఆజాం రిజర్వ్ లైన్ మసీదు, కుర్బాన్ మసీదులో జరిగిన నమాజ్ అనంతరం ముస్లింలను ఆప్యాయంగా పలకరించారు. దక్షిణ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు ద్రోణంరాజు శ్రీవత్సవ్, డాక్టర్ జహీర్ అహ్మద్, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి, ఆదివిష్ణురెడ్డి, వాసర్ల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పేదలను అక్కున చేర్చుకున్న సీఎం జగన్..



దొండపర్తిలో 'జగన్ మామయ్య' అంటూ ప్లకార్డు ప్రదర్శిస్తున్న చిన్నారితో వాసుపల్లి

బడుగు, బలహీన వర్గాలు, పేదలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదరించి అక్కున చేర్చుకున్నారని వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. జగనన్న చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమమే తమ పార్టీని గెలిపిస్తాయన్నారు. ప్రతి ఇంటికి మేలు చేసిన సీఎం జగన్‌ను గెలిపించుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతిపక్షాల కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. మరింత అభివృద్ధి, సంక్షేమాలకు మళ్లీ జగన్‌నే ముఖ్యమంత్రిని చేసుకోవాలని తెలిపారు.

దక్షిణలో 19 నామినేషన్ల ఆమోదం

- ఒకటి తిరస్కరణ

దాబాగార్డెన్స్ : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా దక్షిణ నియోజకవర్గానికి దాఖలైన మొత్తం 20 నామినేషన్లలో 19 నామినేషన్లను ఆమోదిస్తూ, అర్హత లేని ఒక నామినేషన్‌ను తిరస్కరించినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీతారామమ్మూర్తి తెలిపారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్, జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్, బహుజన్ సమాజ్ పార్టీ నుంచి కదిరి రాము, సమాజ్‌వాదీ పార్టీ నుంచి సూరాడ ఎల్లాజీ (హిజ్రా), పలువురు స్వతంత్రుల నామినేషన్లు సక్రమంగానే ఉన్నాయని ఆర్వో తెలిపారు.

మొబైల్ రాగి జావ కేంద్రం ప్రారంభం



కురుపాం మార్కెట్‌లో రాగి జావ తీసుకుంటున్న భవన నిర్మాణ కార్మికులు

దాబాగార్డెన్స్ : మొబైల్ రాగి జావ చలివేంద్రాన్ని స్థానిక స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ శుక్రవారం ప్రారంభించింది. మండుటెండలో కూలి పనులు నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికుల ఉపశమనం కోసం పోషక పదార్థాలు గల రాగిజావను పంపిణీ చేసింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నందున కూలి పనులు చేస్తున్న భవన నిర్మాణ కార్మికులకు రాగి జావ అందజేస్తున్నాం అన్నారు. ఎక్కడ అవసరమైతే అక్కడ ఈ మొబైల్ చలివేంద్రాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల నాయకుడు టి. కృష్ణ, సంస్థ సభ్యులు ఉమ్మడి ఎల్లాజీ, డి. ఎల్లాజీ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సాప్ చేయాలి.

చిరు వ్యాపారుల పెద్ద మనసు



రవికుమార్ ద్వారా శిశువు తల్లిదండ్రులకు ఆర్థిక సాయం చేస్తున్న వీధి విక్రయదారులు

మహారాణిపేట : చిరు వ్యాపారులు పెద్ద మనసు చాటుకున్నారు. ఓపెన్ హార్ట్ సర్జరీ అయిన నవజాత శిశువు తల్లిదండ్రులకు విరాళాలు పోగు చేసి మొత్తం రూ. 15 వేలు అందజేశారు. శుక్రవారం శ్రీ గాయత్రి వీధి విక్రయదారుల సంక్షేమ సంఘం (కేజీహెచ్) అధ్యక్షుడు కనిమెరక సత్తిబాబు ఆధ్వర్యంలో బీజేపీ వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్ చేతుల మీదుగా ఈ సాయం అందజేశారు. ఈ సందర్భంగా రూపాకుల రవికుమార్ మాట్లాడుతూ చెమటోడ్చి సంపాదించిన కష్టార్జితాన్ని మరొకరికి సాయపడేందుకు అందజేస్తున్న వీధి విక్రయదారులది గొప్ప మనసు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



వద్దాది పద్మావతిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్



28వ వార్డు యువత, మహిళలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : వాసుపల్లి గెలుపు కోసం పని చేస్తామని వైఎస్సార్‌సీపీలో చేరుతున్న వివిధ పార్టీలు, సంఘాల నాయకులు తెలిపారు. సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. శుక్రవారం సాయంత్రం 37వ వార్డు దివంగత నాయకుడు వద్దాది రాజు భార్య వద్దాది పద్మావతి వాసుపల్లికి తన మద్దతు తెలిపారు. ఆమెకు కండువా కప్పి వాసుపల్లి పార్టీలోకి ఆహ్వానించారు.


చర్మకారుల సేవా సంఘం మద్దతు..

విశాఖ చర్మకారుల సంఘం వాసుపల్లికి మద్దతు తెలిపింది. సంఘం అధ్యక్షుడు దొండపర్తి లక్ష్మణరావు (జోయ్)తో పాటు సంఘం సభ్యులను వాసుపల్లి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ కొండా రాజీవ్‌గాంధీ తదితరులు పాల్గొన్నారు.

28వ వార్డు నుంచి...

వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు రాపాక శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక యువత, మహిళలు పార్టీలో చేరారు. వారిని వాసుపల్లి గణేష్‌కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సమన్వయంతోనే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నరవ ప్రకాశరావు తదితరులు

ఎంవీపీ కాలనీ: ఈ నెల 30న బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని రూపొందించిన వాల్‌పోస్టర్‌ను బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఎంవీపీ కాలనీలోని వీఎంసీ డిగ్రీ కళాశాల వేదికగా శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు, వీఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పని చేసినప్పుడే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. దీన్ని సమాజ హితం కోరే ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ప్రధానంగా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు ఇందుకు సమన్వయంతో పని చేయాలని కోరారు. నేటి పౌరులకు విద్య, ఆవాసం, ఆశ్రయం అందించినప్పుడే వారి భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దగలమన్నారు. అలా జరిగిన నాడే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. దీనిపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించేందుకు నగరంలో పోస్టర్లు, కరపత్రాలు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

సంక్షేమ ప్రదాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వల్లే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు శుక్రవారం విస్తృత ప్రచారం చేశారు. నియోజకవర్గ పరిధి పలు ప్రాంతాల్లో నిర్వహించిన ఈ ప్రచారం ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగింది. ఇంటింటికీ వెళ్లి నాయకులు ప్రజలను కలుసుకుని ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని, ఎమ్మెల్యేగా వాసుపల్లి గణేస్‌కుమార్‌ను గెలిపించాలని అభ్యర్థించారు.

- ఎంపీగా బొత్స ఝాన్సీని, ఎమ్మెల్యేగా వాసుపల్లిని గెలిపించుకుందాం
- నియోజకవర్గం ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు



అచ్చియ్యమ్మపేటలో ప్రచారం చేస్తున్న డాక్టర్ మూగి శ్రీనివాస్, లింగం శ్రీనివాస్ తదితరులు



కొబ్బరితోట పీహెచ్‌సీ వద్ద ప్రసంగిస్తున్న 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి



35వ వార్డులో ప్రచారం చేస్తున్న అలపన కనకరెడ్డి



33వ వార్డులో ప్రచారం చేస్తున్న బొడ్డేటి ప్రసాద్ తదితరులు



ఇస్త్రీ చేస్తూ ప్రచారం చేస్తున్న వాసుపల్లి కోడలు రాశి



29వ వార్డులో ప్రచారం చేస్తున్న పీతల వాసు

అల్లిపురం : జీవీఎంసీ 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అచ్చియ్యమ్మపేట, కెప్టెన్ రామారావు జంక్షన్, యాతపేట తదితర ప్రాంతాల్లో వార్డు నాయకులు మూగి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి లింగం శ్రీనివాసరావు తదితరులతో కలిసి ప్రచారం చేశారు.

33వ వార్డులో..

పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిరిపల్లి రాము ఆధ్వర్యంలో నీలమ్మవేపచెట్టు, వివేకానందకాలనీ, బంగారమ్మమెట్ట, అస్సాంగార్డెన్స్, సౌత్ జైలురోడ్డు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. బూత్ ప్రెసిడెంట్లు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

35వ వార్డులో..

జగదాంబ : జీవీఎంసి 35వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అలపన కనకరెడ్డి శుక్రవారం వార్డులోని పలు ప్రాంతాల్లో విస్తృత ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బొడ్డేటి ప్రసాద్ ఆధ్వర్యంలో..

అల్లిపురం : 33వ వార్డు నాయకుడు బొడ్డేటి ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మి, ఎమ్మెల్యేగా వాసుపల్లి గణేష్‌కుమార్‌ను గెలిపించాలని గడప గడపకు వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు.

29వ వార్డులో..

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 29వ వార్డు పరిధి పలు ప్రాంతాల్లో నియోజకవర్గ పరిశీలకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, మండల అధ్యక్షుడు పీతల వాసు శుక్రవారం పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టారు. అంగటిదిబ్బ, ఫైర్ ఆఫీస్ ఏరియా తదితర ప్రాంతాల్లో ముమ్మరంగా ప్రచరాం చేశారు. బొత్స ఝాన్సీలక్ష్మిని, వాసుపల్లి గణేష్‌కుమార్‌ను గెలిపించాలంటూ ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో కనకల ఈశ్వర్, నీలాపు లక్ష్మి, బుల్లెట్ రవి, కోరాడ సురేష్, బెవర మహేష్, అడపా శివ, తమ్మినేని శ్రీనివాస్, కొయ్య చిన్ని, కిలాని రోహిత్, ఎర్రా బుజ్జి, ఇమంది నందకిషోర్, గుమ్మడి చంద్రమౌళి, బుజ్జి, నడుపూరి రాజు, గండి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

31వ వార్డులో..

పేదలకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని దక్షిణ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ కోడలు రాశి ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం 31వ వార్డులో మండల అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ నేతృత్వంలో యల్లమ్మతోట, కనకలవీధి, చాకలిపేట, బొడ్డునాయుడు తోట, గొల్లలపాలెం, కృష్ణాగార్డెన్స్ తదితర ప్రాంతాల్లో విస్తృత ప్రచారం చేశారు. పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతుల సమర్పిస్తారు.

ప్రభుత్వరంగ సంస్థలే ఆయువుపట్టు



మాట్లాడుతున్న ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు రామస్వామి

అగనంపూడి: దేశానికి ఆయువుపట్టు వంటి ప్రభుత్వరంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయాలనుకోవడం సరికాదని ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు యు.రామస్వామి అన్నారు. దీనివల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు తీరని నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1170వ రోజు ఆయన మాట్లాడారు. ఏ రాష్ట్రంలోనైనా ప్రభుత్వరంగ సంస్థను కేంద్రం అమ్ముజూపితే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిఘటించాలని కోరారు. లేకపోతే ప్రజల తిరుగుబాటు తప్పదన్నారు. పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలన్నీ ఒకరిద్దరి చేతుల్లో పెట్టాలనుకుంటే ఉప్పెన తప్పదని, ఆ ఉప్పెనలో కేంద్ర పాలకులు కొట్టుకుపోతారని హెచ్చరించారు. పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా మద్దతుతోనే ప్లాంట్ అమ్మకాన్ని అడ్డుకున్నా

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్



మాట్లాడుతున్న ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హై కోర్టు స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేసిందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు, విశాఖ ఎంపీ అభ్యర్థి, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి కేఏపాల్ వెల్లడించారు. ఆశీలమెట్టలోని కేఏపాల్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల మద్దతుతోనే ప్లాంట్ అమ్మకం అడ్డుకున్నానని తెలిపారు. హైకోర్టుకు 60 సార్లు హాజరయ్యానని చెప్పారు. ఉక్కు ప్రైవేటీకరణ ఆపానని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమావేశంలో జ్యోతి, ఏసుపాదం రవికుమార్, సుభాకర్ పాల్గొన్నారు.